## నిఘా నేత్రాలపై నిర్లక్ష్యమేల..?



2





2

## రైతులు ఆరుతడి పంటలు వేయాలి



AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatodaynews.com


## ఆగస్టు 4న సెమిస్టర్ పరీక్షలు



**అక్షరటుడే, తెయూ క్యాంపస్:** తెలంగాణ వర్సిటీ పరిధిలో వాయిదా పడిన బీఈడీ, బీపీఈడీ 2, 3 సెమిస్టర్ పరీక్షలు ఆగస్టు 4వ తేదీన నిర్వహిస్తామని కంట్రోలర్ సంపత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల తెలిపారు. విద్యాసంస్థల బంద్ కారణంగా తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో ఈనెల 24న ఆయా పరీక్షలు వాయిదా పడ్డాయన్నారు. ఈ విషయాన్ని బీఈడీ, బీపీఈడీ విద్యార్థులు గమనించాలని కోరారు.





## జనగణన హ్యాండ్‌బుక్‌లో ఖచ్చితత్వం తప్పనిసరి

**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ తయారీలో సమాచార సేకరణ దశ నుంచే నాణ్యత, ఖచ్చితత్వం, పారదర్శకతను పాటించాలని కలెక్టర్, ప్రధాన జనగణన అధికారి ఆశిష్ సంగ్వాన్ స్పష్టం చేశారు. శనివారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో క్షేత్రస్థాయి సిబ్బందికి ప్రత్యేక శిక్షణా కార్యక్రమంలో మాట్లాడారు. జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ భవిష్యత్తులో జిల్లా సామాజిక, ఆర్థిక, భౌగోళిక, పరిపాలనా వివరాలకు ప్రామాణిక ఆధార గ్రంథంగా ఉపయోగపడుతుందన్నారు. అందువల్ల ప్రతి సమాచారాన్ని సంబంధిత రికార్డులతో క్షుణ్ణంగా సరిపోల్చి, ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా నమోదు చేయాలని సూచించారు. శిక్షణలో ఇచ్చిన మార్గదర్శకాలను సిబ్బంది పూర్తిగా అవగాహన చేసుకుని, వాటిని క్షేత్రంలో సమర్థంగా అమలు చేయాలని ఆదేశించారు. రెవెన్యూ, ప్లానింగ్ తదితర శాఖలతో సమన్వయం చేసుకుంటూ నిర్ణీత గడువులోపు నివేదికలు సమర్పించాలని తెలిపారు. నాణ్యమైన సమాచారంతో జిల్లా జనగణన హ్యాండ్‌బుక్‌ను సకాలంలో సిద్ధం చేయడం ప్రతి అధికారి బాధ్యత అని కలెక్టర్ పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, హైదరాబాద్‌కు చెందిన జనగణన అధికారి రమణ, సీపీవో రఘునందన్, సూపరింటెండెంట్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

## బీజేపీ కౌన్సిలర్లపై చర్యలు తీసుకోవాలి: ఛైర్‌పర్సన్




**అక్షరటుడే, కామారెడ్డి:** మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల్లో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న బీజేపీ కౌన్సిలర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం అదనపు కలెక్టర్ ఎన్‌వై గిరికి వినతిపత్రం అందజేశారు. ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ.. బీజేపీ కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశాలు సజావుగా సాగనివ్వడం లేదన్నారు. ప్రజారోగ్యం, మౌలిక వసతులు, పారిశుధ్యం వంటి ముఖ్య అంశాలపై చర్చ జరగాల్సిన సమావేశాలు బీజేపీ కౌన్సిలర్ల అనుచిత ప్రవర్తనతో అస్తవ్యస్తంగా మారుతున్నాయని ఆరోపించారు. సమావేశాల్లో దొంగ ఎజెండా అంటూ అసభ్య పదజాలం వాడుతున్నారని, దుర్భాషలాడుతూ.. భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. మున్సిపల్ చట్టం, నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్రవర్తిస్తున్నారని, దీనివల్ల అభివృద్ధి పనులు, నిధుల వినియోగంపై సరైన చర్చ జరగడం లేదని తెలిపారు. సమావేశాల వీడియో రికార్డులను పరిశీలించి తప్పు చేసిన కౌన్సిలర్లపై చట్ట ప్రకారం క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని, మున్సిపల్ సమావేశాలు ఎలాంటి ఆటంకం లేకుండా సజావుగా సాగేందుకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

### రెగ్యులర్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టింగ్ ఇవ్వండి

మున్సిపాలిటీలో రెగ్యులర్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ లేకపోవడంతో పారిశుధ్య పనులు స్తంభించాయని, వెంటనే పోస్టింగ్ ఇవ్వాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ అదనపు కలెక్టర్‌ను కోరారు. డోర్‌టుడోర్ చెత్త సేకరణ, పబ్లిక్ శానిటేషన్ నిర్వహణ, సిబ్బంది పర్యవేక్షణ, ప్రజల ఫిర్యాదుల పరిష్కారం, ప్రజారోగ్య చర్యల అమలులో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. సాంకేతిక, పర్యవేక్షణ సిబ్బంది లేకపోవడంతో పారిశుధ్య ప్రమాణాలు పాటించడం కష్టంగా మారిందని, దీనిపై ప్రజల నుండి ఫిర్యాదులు రోజురోజుకు పెరుగుతున్నాయని తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి..





ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా తొలి ఏకాదశి పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోవిందనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి.

– అక్షరటుడే, నిజామాబాద్ సిటీ



డిచ్‌పల్లి బెటాలియన్‌లోని వేంకటేశ్వరాలయంలో..



నిజామాబాద్ నగరంలోని జెండా బాలాజీ ఆలయంలో..

పేదింటి ఆడపిల్ల కుటుంబాలకు బాసటగా నిలిచేందుకు గత ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రారంభించింది. అయితే ఈ పథకాల లబ్ధి పొందేందుకు కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారు. అర్హత లేకున్నా ప్రభుత్వ నిధులు కాజేసేందుకు పన్నాగాలు పన్నుతున్నారు.

–అక్షరటుడే, కామారెడ్డి



# దర్జాగా ఫోర్జరీ!

- కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల్లో అక్రమాలు
- అసలు లబ్ధిదారులకు సంతకాలు పెట్టేందుకు భయపడుతున్న అధికారులు
- ఫోర్జరీ సంతకాల కేసులో ముగ్గురు అరెస్ట్
- విచారణలో మరిన్ని దరఖాస్తులు బయటపడే అవకాశం

కల్యాణ లక్ష్మి పథం ద్వారా యువతుల వివాహం తర్వాత దరఖాస్తు చేసుకున్న వారికి ప్రభుత్వం రూ.లక్ష చెక్కులను అందజేస్తుంది. ఈ పథకం ప్రారంభంలో నిజమైన లబ్ధిదారులకే మేలు చేసింది. కానీ డబ్బు ఎక్కువగా ఉండడంతో కొందరు ఈ పథకాన్ని సొమ్ము చేసుకోవడానికి కొందరు అడ్డదారులు తొక్కుతున్నారు. . అర్హత లేకపోయినా దరఖాస్తులు పెట్టి ప్రభుత్వ నిధులను కాజేయడానికి పథకాలు వేయడం మొదలుపెట్టారు. గెజిటెడ్ సంతకం చేసిన దరఖాస్తులకు ఆర్థిక ప్రయోజనం లభించడంతో కొందరు అక్రమార్కులు ఈ పథకాన్ని తమకు అనుకూలంగా మార్చుకోవడం మొదలుపెట్టారు. గెజిటెడ్ అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసి చేసి క్యాష్ చేసుకుంటున్నారు. తాజాగా ఫోర్జరీ కేసులో కామారెడ్డిలో ముగ్గురు అరెస్ట్ కావడం జిల్లాలో కలకలం రేపుతోంది.

### ఫోర్జరీ సంతకాలతో దరఖాస్తులు..

మోసాలను అరికట్టేందుకు ప్రభుత్వం దరఖాస్తుపై గెజిటెడ్ అధికారి సంతకాన్ని తప్పనిసరి చేసింది. కానీ అక్రమార్కులు దీన్నే ఆయుధంగా మార్చుకున్నారు. గెజిటెడ్ వైద్యులు, ఇతర అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి, నకిలీ సీల్స్ వేసి దరఖాస్తులను సిద్ధం చేస్తున్నారు. లబ్ధిదారులకు గెజిటెడ్ సంతకాలు చేయడానికి అధికారులు అంతగా ముందుకు రాకపోవడంతో కొందరు వ్యక్తులు తామే సంతకాలు చేయిస్తామని చెప్పి వసూళ్లకు తెరలేపారు.

### భయపడుతున్న అధికారులు

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలుకు గెజిటెడ్ అధికారులు సంతకాలు చేయడానికి వెనుకంజ వేస్తున్నారు. ఎవరు అసలైన లబ్ధిదారులో, ఎవరు కాదో తెలియని పరిస్థితి నెలకొంది. ఏదైనా విచారణ జరిగి అసలు లబ్దిదారులు కాదని తెలిస్తే తమ ఉద్యోగాలు పోతాయని అధికారులు భయపడుతున్నారు. అర్హులైన నిజమైన లబ్ధిదారులు వచ్చి సంతకం కోసం అడిగినా గెజిటెడ్ అధికారులు జంకుతున్నారు. దీనివల్ల అసలు అర్హులకే ఈ పథకం అందకుండా పోతున్న పరిస్థితి ఏర్పడింది.

### ఫోర్జరీ కేసులో..

ఫోర్జరీ సంతకాలతో దరఖాస్తులు చేసి ప్రభుత్వాన్ని మోసం చేస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. జిల్లా జనరల్ ఆస్పత్రి ఆర్ఎంఓ సంతకం ఫోర్జరీ చేయడంతో పాటు అధికారి స్టాంప్ కూడా వేయడం కలకలం రేపింది. వారి వద్ద నుంచి నకిలీ సీల్స్, ఫారాలు, ఇతర పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురి అరెస్ట్‌తో జిల్లాలో ఒక్కసారిగా కలకలం రేగింది. ఈ ముఠాలో ఇంకా ఎంత మంది ఉన్నారనే కోణంలో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

### బయటపడింది ఇలా..

భిక్కనూరు మండలంలో కల్యా ణలక్ష్మి పథకం కోసం పలువురు లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు. 12 మందికి సంబంధించిన దరఖాస్తులను అధికారులు పరిశీలిస్తుండగా కొన్ని దరఖాస్తులలో గెజిటెడ్ అధికారి సంతకం తేడాగా కనిపించడంతో అధికారులు సదరు గెజిటెడ్ వైద్యుడినికి సమాచారం అందించారు. దీంతో ఆయన తన సంతకం ఫోర్జరీ అయిందని గుర్తించారు. ఈ మేరకు సదరు గెజిటెడ్ వైద్యుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా భిక్కనూర్ మండల కేంద్రంలో ఓ జిరాక్స్ సెంటర్ నిర్వాహకుడి తతంగం బయటపడింది. విచారణ చేపట్టిన పోలీసులు ఫోర్జరీ కేసులో ముగ్గురిని అరెస్ట్ చేసి తదుపరి విచారణ కొనసాగిస్తున్నారు. గతంలో ఎంతమంది దరఖాస్తులకు సంతకాలు ఫోర్జరీ చేశారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

## 'సర్' ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలి



**అక్షరటుడే, ఆర్మూర్ :** 'సర్' ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా సూచించారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కోటార్మూర్ గ్రామంలో శనివారం ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ పనులపై బీఎల్‌వోలకు సూచనలు అందజేశారు.

## హైకోర్టు న్యాయమూర్తులకు ఘన స్వాగతం



**అక్షరటుడే, నిజామాబాద్‌సిటీ:** జిల్లా పర్యటనకు వచ్చిన హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ తంగిరాల మాధవి దేవి, జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి, జస్టిస్ గడి ప్రవీణ్ కుమార్‌లకు ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. హైకోర్టు న్యాయమూర్తులు ముందుగా స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌కు చేరుకుని పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా జడ్జి జీవీఎన్ భరత లక్ష్మి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్ర కుమార్, ఆయా శాఖల జిల్లా అధికారులు, న్యాయ శాఖ అధికారులు, న్యాయవాదులు, బార్ అసోసియేషన్ల ప్రతినిధులు హైకోర్టు జడ్జీలను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. అనంతరం జిల్లా జడ్జి, సీపీ, అదనపు కలెక్టర్ తదితరులతో హైకోర్టు న్యాయమూర్తులు అతిథి గృహంలో వివిధ అంశాలపై చర్చించారు.

## ముస్లింల హక్కుల పరిరక్షణకు ఐక్య పోరాటం అవసరం

**అక్షరటుడే, కామారెడ్డి:** దేశంలో ముస్లింలతో పాటు దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాల హక్కులను కాపాడేందుకు అన్ని వర్గాలు ఐక్యంగా పోరాడాలని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. శనివారం న్యూఢిల్లీ ప్రెస్‌క్లబ్ ఆఫ్ ఇండియాలో జరిగిన 'ముస్లింల హక్కుల పరిరక్షణపై న్యూఢిల్లీ డిక్లరేషన్' విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

### ప్రతి పౌరుడికి హక్కులు కల్పించింది..

భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిందని, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని పేర్కొన్నారు. రాజ్యాంగ విలువలు, లౌకికవాదం, సామాజిక న్యాయం, సమానత్వాలను పరిరక్షించేందుకు సమాజంలోని అన్ని వర్గాలు కలిసి నిలవాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. సర్ ప్రక్రియలో ప్రతి అర్హుడైన పౌరుడి ఓటు హక్కు రక్షించబడేలా ఎన్నికల సంఘం పారదర్శకంగా వ్యవహరించాలని నాయకులు డిమాండ్ చేశారు. ముఖ్యంగా ముస్లింలు, దళితులు, ఆదివాసీలు,



వెనుకబడిన వర్గాల ఓటర్ల హక్కులు ఎలాంటి అన్యాయానికి గురికాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జమ్మూ అండ్ కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ, మాజీ రాజ్యసభ సభ్యుడు మహమ్మద్ అదీబ్, కేంద్ర మాజీ విదేశాంగ మంత్రి సల్మాన్ ఖుర్షీద్‌తో పాటు పలువురు మేధావులు, న్యాయవాదులు, సామాజిక కార్యకర్తలు, ముస్లిం సమాజ ప్రతినిధులు పాల్గొన్నారు.

## త్వరలో రూ.60 కోట్లతో అన్ని డివిజన్లలో పనులు: ధన్‌పాల్

**అక్షరటుడే, ఇందూరు:** త్వరలోనే అర్బన్‌లో రూ.60కోట్లతో అన్ని డివిజన్లలో పనులు ప్రారంభం కానున్నాయని ఎమ్మెల్యే ధన్‌పాల్ పేర్కొన్నారు. ఈ మేరకు తన క్యాంప్ కార్యాలయంలో శనివారం పబ్లిక్ హెల్త్, ఆర్ అండ్‌బీ అధికారులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో కొనసాగుతున్న ప్రతి పనిపై అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పర్యవేక్షణ చేయాలని ఎమ్మెల్యే సూచించారు. టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.60 కోట్లతో ప్రారంభమైన పనులను నాణ్యతతో చేపట్టాలని సూచించారు. ప్రతి డివిజన్‌కు రూ.కోటి కేటాయించారని త్వరలోనే అన్ని డివిజన్‌లో పనులు ప్రారంభమవుయన్నారు. సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు సిబ్బందితో సమీక్షలు నిర్వహిస్తూ పనుల పురోగతిపై సూచనలు ఇవ్వాలన్నారు. అలాగే నూతన పనులపై ప్రతిపాదనలను సిద్ధం చేసి ప్రభుత్వానికి అందించాలని సూచించారు. ప్రధానగా నగరంలోని రేడియో స్టేషన్ నుంచి ముదక్‌పల్లి వరకు రూ.30 కోట్లతో రోడ్డు ప్రతిపాదించామన్నారు. అలాగే ఆర్‌యూబీల నిర్మాణానికి రూ.60 కోట్లు, నాందేవ్




వాడ వంతెన పొడిగింపునకు రూ.100 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అమృత్-2 కింద మంజూరైన యూజీడీ పనుల్లో వేగం పెరిగిందని తెలిపారు. సమావేశంలో పబ్లిక్ హెల్త్ ఈఈ తిరుపతి, డీఈ యోగేందర్, ఏఈ శంకర్, యూజీడీ ప్రాజెక్ట్ మేనేజర్ జయశంకర్, ఆర్అండ్‌బీ అధికారి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆలయ వార్షికోత్సవం



**అక్షరటుడే, బోధన్:** మండలంలోని ఉట్‌పల్లి గ్రామంలో సంత్ సేవాలాల్ ఆలయ 9వ వార్షికోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వార్షికోత్సవ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఉదయ్ మారాజ ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. అనంతరం ఆలయంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పెరిక సంఘం జిల్లా అధ్యక్షుడికి సన్మానం



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** పెరిక సంఘం నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడిగా భరత్ సత్యనారాయణ ఇటీవల ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవంత్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు కెంపుల నాగరాజు, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం అధ్యక్షుడు గోపాల్ యాదవ్, బీసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండల ప్రదీప్, లింగాయత్ సమాజ్ సలహాదారులు, మహారాష్ట్ర ఓబీసీ మంచ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కూరే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్‌లు అందజేత



**అక్షరటుడే, ముప్కాల్:** మండలంలోని నాగంపేట్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ఆరుగురు లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లను సకాలంలో నిర్మించుకుని పథకం ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాసరి గంగాధర్, జీపీ కార్యదర్శి ముంచిర్యాల కవిత, ఉప సర్పంచ్ పంతంగి మదన్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొలిపి శ్రీకాంత్, గ్రామశాఖ అధ్యక్షుడు ముత్యం రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కేతరి నారాయణ, చంటి, వార్డు సభ్యులు బోన్ల రవికుమార్, భదనపల్లి సురేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.


## రైతులు ఆరుతడి పంటలు వేయాలి



**అక్షరటుడే, డిచ్‌పల్లి:** ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తక్కువ ఉన్నందున రైతులు ఆరుతడి పంటలు పండించాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కాటిపల్లి నగేష్ రెడ్డి సూచించారు. డిచ్‌పల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్‌నినోతో వర్షాలు కురవకపోవడం.. భూగర్భ జలాలు తగ్గిపోతున్నందున మొక్కజొన్న, కందులు, పత్తి, సోయ లాంటి పంటలు పండించాలని నగేష్ రెడ్డి సూచించారు. వీటికి రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధర ఇస్తుందన్నారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడాలని కోరారు. దేశంలో 12 ఏళ్ల నుంచి అధికారంలో ఉన్న బీజేపీ హయంలో ఎన్నో కుంభకోణాలు, అవినీతి, పేపర్ లీకేజీలు అయ్యాయని. వాటికి ఏ ఒక్క మంత్రి కూడా బాధ్యత వహించలేదన్నారు. విద్యార్థుల తల్లి దండ్రులు ఆస్తులు అమ్మి చదివిస్తుంటే నీట్ లాంటి పేపర్ లీకేజీలు బీజేపీ ప్రభుత్వంలో అవుతున్నాయన్నారు. విద్యార్థులకు మద్దతుగా కాంగ్రెస్ అగ్ర నేతలు రాహుల్ గాంధీ , ప్రియాంక గాంధీ నిరసన కార్యక్రమం చేస్తుంటే వారికి అక్రమంగా అరెస్ట్ చేయడం బీజేపీకే చెల్లిందన్నారు. బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు త్వరలో తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. ఇటు రాష్ట్రంలో మరొకసారి రేవంత్ రెడ్డి సీఎం కావడం తథ్యమన్నారు. అటు కేంద్రంలో రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి పొలసాని శ్రీనివాస్, కాంగ్రెస్ డిచ్‌పల్లి అధ్యక్షుడు అంబర్ సింగ్, ఐడీసీఎంస్ మాజీ ఛైర్మన్ తారాచంద్ నాయక్, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు యాదగిరి, మాజీ ఎంపీపీ నర్సయ్య, పీఏసీఎస్ ఛైర్మన్లు గంగారెడ్డి, నాయకులు రాంచందర్ గౌడ్, శ్రీనివాస్, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నిఘా నేత్రాలపై

# నిర్లక్ష్యమేల..?



**ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని పోలీసు అధికారులు పేర్కొంటుంటారు. అలాగే పలు గ్రామాల్లో సీసీ కెమెరాలను సైతం జీపీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నారు. అయితే ఈ సీసీ కెమెరాల వ్యవస్థ మూన్నాళ్ల ముచ్చటగా మారుతోంది. మరమ్మతులకు గురైన కెమెరాలపై పట్టించుకునే నాథుడే లేకుండా పోయారు. మండలంలోని చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.**

**– అక్షరటుడే, గాంధారి**

- ప్రారంభించి మరిచిపోతున్న వైనం
- నిర్వహణను పట్టించుకొని అధికారులు
- పని చేయకుండా పోతున్న కెమెరాలు
- గాంధారిలో నిఘా కరువైన గ్రామాలెన్నో..

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయి. నేరాలు జరిగిన తర్వాత నిందితులను పట్టుకోవడంతో సహకరిస్తాయి. దీంతో పోలీసులు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి మరి సీసీ కెమెరాల గురించి వివరిస్తున్నారు. గ్రామాలు, కాలనీల్లో కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నారు. పోలీసులు చెబుతుండటంతో ప్రజలు, వ్యాపారులు స్వచ్ఛందంగా ఏర్పాటు చేసుకుంటున్నారు. గ్రామాల్లో సైతం పంచాయతీ ఆధ్వర్యంలో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. అయితే నిర్వాహణను గాలికి వదిలేస్తున్నారు. అవి పాడైపోయిన పట్టించుకోవడం లేదు.

### గాంధారిలో 50 కెమెరాలు..

గాంధారి మండలంలో 45 జీపీలు ఉన్నాయి. ఇందులో 52వేలకు పైగా జనాభా ఉంది. మండల కేంద్రంలో 11వేలకు పైగా జనాభా ఉంది. మండల కేంద్రంలోని వివిధ సంఘాలు, వీడీసీ ఆధ్వర్యంలో రూ.6లక్షలతో విరాళాలు పోగుచేశారు. వాటితో గతంలో పనిచేసిన ఎస్సై ఆంజనేయులు ఆధ్వర్యంలో 50కి పైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అయితే ఇప్పుడు వాటిలో చాలా వరకు పనిచేయకుండా పోయాయి. వాటిని పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. అలాగే 45 జీపీలల్లో గుర్జుల్, గుర్జాల్ తండా, ముదెల్లి, మొండిసడక్, మాతు సంగెం,రాంపూర్ గడ్డ, మేడిపల్లి, గుర్జాల్‌లలో సీసీ కెమెరాలు ఉన్నాయి. రాంపూర్ గడ్డ, మేడిపల్లి, గుర్జాల్‌లలో సీసీ కెమెరాలు పనిచేయట్లేదు.

### బాగు చేయించాలని డిమాండ్

నేర నియంత్రణ భాగంలో ఎంతో ఆవశ్యకతమైన సీసీ కెమెరాలు బాగు చేయించకపోతే రూ.లక్షలు పెట్టి ఏర్పాటు చేసిన కెమెరాలు ఎందుకుని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. బైక్, చైన్ స్నాచింగ్‌లు జరిగితే దొంగలను పట్టుకునేందుకు అత్యంత కీలకమైన ఈ కెమెరాలు సరిగ్గా లేకపోతే సొత్తు రికవరీ ఎలా జరుగుతుందని.. కేసులు ఎలా చేధిస్తారని పలువురు వాపోతున్నారు. పెద్ద ఎత్తున చోరీలు జరిగినప్పుడు సీసీ కెమెరాలే కీలకమని తెలిసినప్పటికీ పోలీసులు సైతం ముందుకు వచ్చి నిర్వాహకులకు అవగాహన కల్పించట్లేదని పేర్కొంటున్నారు. గతంలో ఈ కెమెరాలను ప్రారంభించేందుకు స్వయంగా ఎస్పీ రాజేష్ చంద్ర వచ్చారు. 50 కెమెరాలను ఏర్పాటు చేసినందుకు వీడీసీని అభినందించారు. కానీ ప్రస్తుతం వాటిలో కొన్ని మరమ్మతులకు గురికాగా.. ఎవరు పట్టించుకోవడం లేదు.

### కెమెరాలు పనిచేయట్లేదు..



మా పోచమ్మగల్లీలోని సీసీ కెమెరాలు నెలరోజులకు పైగా పనిచేయట్లేదు. అయినప్పటికీ మరమ్మతులు చేయించడం లేదు. అసలే మండల కేంద్రంలో దొంగతనాలు ఎక్కువ. ఇకనైనా సంబంధిత వ్యక్తులు వెంటనే సీసీ కెమెరాలు బాగు చేయించాలి.

**– నందు, ఉద్యోగి, గాంధారి**

## హిందూ సంప్రదాయంలో తొలి ఏకాదశికి ఎంతో ప్రాధాన్యత : ఎమ్మెల్యే ధన్‌పాల్



**అక్షరటుడే, ఇందూరు:** హిందూ సంప్రదాయంలో తొలి ఏకాదశికి ఎంతో ప్రాధాన్యత ఉందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా పేర్కొన్నారు. ఆషాడశుద్ధ ఏకాదశి (తొలి ఏకాదశి) పురస్కరించుకుని నగరంలోని నాందేవ్ వాడ, బ్రహ్మపురిలో ఉన్న విఠలేశ్వర ఆలయాల్లో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహావిష్ణువు రూపం విఠలేశ్వరుడు అని పేర్కొన్నారు. ఏకాదశి నుంచి మహావిష్ణువు యోగ నిద్రలోకి ప్రవేశిస్తాడని పురాణాలు చెబుతున్నాయన్నారు. ఉపవాసం చేసి మహావిష్ణువును ఆరాధిస్తే పాపాలు తొలిగి, ఆయురారోగ్యం, అష్టైశ్వర్యాలు కలుగుతాయని విశ్వాసం అన్నారు. మహారాష్ట్రలో విఠలేశ్వరుడు, రుక్మిణి దేవిని అత్యధికంగా కొలుస్తారని, ఇందూరులోనూ మహారాష్ట్ర సాంప్రదాయం పాటిస్తారని గుర్తు చేశారు. కార్పొరేటర్లు ఎర్రం సుధీర్, జగదీష్ కులకర్ణి, నాగోళ్ల లక్ష్మీనారాయణ, మల్కాయి మహేందర్, జ్యోతి మురళి, బంటు ప్రీతి ప్రవీణ్, ప్రసూన శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## గోదావరి పుష్కరాలకు ఏర్పాట్లు చేయాలి



**అక్షరటుడే, నిజామాబాబాద్ క్రైం:** గోదావరి పుష్కరాలకు ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేయాలని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. పుష్కరాలు-2027పై డీజీపీ (లా అండ్ ఆర్డర్) మహేష్ భగవత్‌తో శనివారం సీపీ వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. అనంతరం సీపీ మాట్లాడుతూ.. పుష్కరాల సందర్భంగా చేపట్టాల్సిన భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల రద్దీ నిర్వహణపై అధికారులకు పలు సూచనలు సలహాలు అందజేశారు. అత్యవసర సేవల సమన్వయం, విపత్తు నిర్వహణ, కమ్యూనికేషన్ వ్యవస్థల బలోపేతం తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. పుష్కరాలు జరిగే రెంజల్, మెండోరా, ఏర్గట్ల పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న పుష్కర ఘాట్ల వద్ద చేపడుతున్న ఏర్పాట్లపై ప్రత్యేకంగా చర్చించారు. భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని తాత్కాలిక పోలీస్ అవుట్‌పోస్టులను ఏర్పాటు చేయాలని సీపీ సూచించారు. వీసీలో అదనపు డీసీపీ (అడ్మిన్) శుభం ప్రకాశ్, ఏసీపీలు ప్రకాష్, వెంకటేశ్వర రెడ్డి, శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌రెడ్డి,మల్లేష్, నిజామాబాద్ గోదావరి పారివాక ప్రాంతంలోని సీఐలు, ఎస్సైలు, ఆఫీస్ సూపరింటెండెంట్ శంకర్ పాల్గొన్నారు.

# కేఐటీడబ్ల్యూలో ‘ఏడబ్ల్యూఎస్ స్టూడెండ్ బిల్డర్ గ్రూప్’


**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలోని కాకతీయ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థినుల సాంకేతిక నైపుణ్యాలను మరింత పెంచుకునే విధంగా ముందడుగు పడింది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఐటీ దిగ్గజ సంస్థ ‘అమెజాన్ వెబ్ సర్వీసెస్’ కు చెందిన ‘ఏడబ్ల్యూఎస్ స్టూడెంట్ బిల్డర్ గ్రూప్’ ప్రోగ్రామ్‌ను కళాశాల ప్రాంగణంలో ఈ రోజు ఘనంగా ప్రారంభించారు.

### ఆన్‌లైన్ వెబినార్.. గ్లోబల్ ఎక్స్‌పోజర్

ఏడబ్ల్యూఎస్ క్లౌడ్ ఇంజినీర్ రుద్రమధబా మిశ్ర ఆన్‌లైన్ ద్వారా ఈ ప్రోగ్రామ్‌ను అధికారికంగా ప్రారంభించారు. అనంతరం విద్యార్థినులకు ‘ఆధునిక క్లౌడ్ కంప్యూటింగ్ టెక్నాలజీ’ అనే అంశంపై ప్రత్యేక వెబినార్ నిర్వహించారు. ఐటీ రంగంలో క్లౌడ్ టెక్నాలజీకి ఉన్న ప్రాధాన్యతను, భవిష్యత్ అవకాశాలను ఆయన సులభరీతిలో వివరించారు.

### క్లౌడ్ కంప్యూటింగ్ టెక్నాలజీ అవసరం

ప్రిన్సిపాల్ డాక్టర్ సెల్వకుమార్ రాజా మాట్లాడుతూ.. ‘నేటి వేగవంతమైన డిజిటల్ యుగంలో క్లౌడ్ కంప్యూటింగ్ నైపుణ్యాలు ఎంతో అత్యవసరమన్నారు. ఏడబ్ల్యూఎస్ స్టూడెంట్ బిల్డర్ గ్రూప్ ద్వారా లభించే అవకాశాలను అందిపుచ్చుకొని విద్యార్థినులు అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలను పెంపొందించుకోవాలి. ఇది వారి భవిష్యత్ కెరీర్‌కు, ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి ఎంతగానో




ఉపయోగపడుతుందన్నారు.

### ప్రాజెక్ట్‌లు చేసేందుకు..

అనంతరం వైస్ ప్రిన్సిపాల్ సాయిరెడ్డి మాట్లాడుతూ.. ఈ స్టూడెంట్ బిల్డర్ గ్రూప్స్ ద్వారా విద్యార్థినులకు కేవలం సిద్ధాంతపరమైన జ్ఞానమే కాకుండా, ప్రాక్టికల్ ప్రాజెక్ట్‌లు చేసేందుకు ‘హ్యాండ్స్‌ఆన్ లాబ్స్’ అందుబాటులోకి వస్తాయన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా రాబోయే టెక్నాలజీ ట్రెండ్స్‌పై అవగాహన పెంచుకోవడానికి ఇదొక అద్భుతమైన వేదిక అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ పి. నాగార్జున్, ఏడబ్ల్యూఎస్ ఎస్‌బీజీ కోర్‌టీం సభ్యులు, వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.



## పిచ్చి మొక్కలు తొలగింపు

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** మండలంలోని దేవనగర్ గ్రామంలో సర్పంచ్ యూసుఫ్ పిలుపు మేరకు ‘స్వచ్ఛందంగా ఒక అడుగు స్వచ్ఛత వైపు’ అనే నినాదంతో గ్రామంలోని పిచ్చిమొక్కలు, పొదలను తొలగించారు. జీపీ పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ వర్షాకాలం కాబట్టి మన చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమల దరిచేరవన్నారు. వ్యాధులు రాకుండా కాపాడుకోగలుగుతామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహమ్మద్ యుసుఫ్‌తో పాటు ఉప సర్పంచ్ పందిరి శ్రీనివాస్, వార్డు సభ్యురాలు జైనబీ, మాజీ ఉపసర్పంచ్ బుచ్చమ్మ, యువకులు, మహిళలు పాల్గొన్నారు.



## ఊర పండుగ, బోనాలకు ఏర్పాట్లు

**అక్షరటుడే, ఆర్మూర్:** ఊర పండుగ, బోనాల నేపథ్యంలో ఆర్మూర్ మున్సిపల్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని మహాలక్ష్మి కాలనీలోని మహాలక్ష్మి అమ్మవారి ఆలయ ఆవరణలో చదును చేశారు. ఆలయ ఆవరణలోనే పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలను తొలగించారు. పనులను మున్సిపల్ ఛైర్‌పర్సన్ గోనె లహరి రఘు, నుడా ఛైర్మన్ కేశవేణు, మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు, ఏఎంసీ ఛైర్మన్ సాయిబాబా గౌడ్, వెంకట్రాంరెడ్డి మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఆలయంలో ప్రత్యేక పూజలు..


తొలి ఏకాదశిని పురస్కరించుకొని ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ భైరవ గుట్ట వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆర్మూర్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ గోనె లహరి రఘు, మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి




**అక్షరటుడే, ఆర్మూర్:** సైబర్ నేరాల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ సూచించారు. మన కాలనీ-మన భద్రత-మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని కేజీబీవీ జూనియర్ కాలేజీలో డ్రగ్స్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలు, మత్తు పదార్థాలను వినియోగించడం వల్ల కలిగే దుష్పరిణామాలను, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో షీటీం సభ్యులు విగ్నేష్, సుమతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పోతుగంటి గంగాధర్‌కు ఘన సత్కారం



**అక్షరటుడే, ఇందూరు:** 'సామాజిక సేవా రత్న' అవార్డును అందుకున్న పోతుగంటి గంగాధర్‌ను భారత్ స్వాభిమాన్ న్యాస్, పతంజలి సంస్థల ఆధ్వర్యంలో ఘనంగ సన్మానించారు. సంస్థ కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించారు. సామాజిక సేవలో విశిష్ట సేవలు అందించినందుకు ఆయనకు ఈ పురస్కారం దక్కింది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో శాలివాహన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఎంపిక చేసిన విశిష్ట వ్యక్తులకు ఈ అవార్డులను ప్రదానం చేశారు. ఇందులో భాగంగా పోతుగంటి గంగాధర్ సేవలను గుర్తిస్తూ 'సామాజిక సేవా రత్న' పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పతంజలి సంస్థ అధ్యక్షుడు శ్రీ బుచ్చన, యువభారత్ అధ్యక్షుడు రంజిత్ కుమార్, యోగా రత్న ప్రభాకర్ గంగాధర్‌ను సత్కరించారు.